క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : కృష్ణా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను కొల్లూరు పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పెసర్లంక అరవింద వారధి సమీపంలోని కృష్ణా నది నుంచి అర్ధరాత్రి నక్కపాయ మార్గంలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ రవీంద్రరెడ్డి పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. తెల్లవారుజాములో రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా.. వెంకటేశ్వర థియేటర్ సమీపంలో అడ్డగించి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి, కోర్టుకు అప్పగించనున్నట్లు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

పాఠశాలల వార్షిక తనిఖీ



పిట్టలవానిపాలెం: విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. అల్లూరు శివారు యాదవపాలెం, నత్తలవారిపాలెం గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ తరగతులు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రికార్డులు, హాజరు రిజిష్టర్ పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సీఆర్పీలు బొలగాని విజయ్, ముసలయ్య, స్రవంతి ఉన్నారు.

పేదల చెంతకు వైద్య సేవలు



కొల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ఎంతో మందికి సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ బీఎం. లక్ష్మీకుమారి అన్నారు. మంగళవారం గాజుల్లంకలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, సరైన సమయంలో వైద్యం పొందాలని సూచించారు. వైద్య శిబిరంలో 223 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సనక వెంకట్రావు, వైద్యులు సుష్మిత, సంధ్యారాణి, శేషగిరి, రవిచంద్ర వైద్య సేవలు అందజేశారు. కొల్లూరు పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

9న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు మింగించాలని చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఎస్.చంద్రిక అన్నారు. పీహెచ్‌సీలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 9న డీ వార్మింగ్ డే సందర్భంగా నులి పురుగుల నివారణ మాత్రలు ఇంటింటికీ అందజేసి, పాఠశాలల విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. మాత్రలు వినియోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్‌ఈఓ నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ నరసింహారావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

రేపల్లెరూరల్: పట్టణంలోని 18వ వార్డులో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలనీలో తాగునీటి సరఫరాకు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్నారు. రోడ్లు వేసి, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు కేవీ లక్ష్మణరావు, ఆశీర్వాదం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ

వేమూరు: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పుర వేదికలో వైఎస్సార్ ఆసరా బహిరంగ సభ బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి శోభన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు బహిరంగ సభ జరుగుతుందని, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త వరికూటి అశోక్ బాబు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూపుల మహిళలు తరలి రావాలని తెలిపారు.

పోలింగ్ బూత్‌ల సమగ్ర నివేదిక ఇవ్వాలి



సెక్టర్ అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వసంతరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హెల షారోన్

- వేమూరు ఎన్నికల అధికారి రాయుడు
- ఓటరు జాబితా అభ్యంతరాలపై రేపల్లె ఆర్డీఓ సమీక్ష

వేమూరు: సార్వత్రిక ఎన్నికలపై ఓటర్లకు పూర్తిగా అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎస్ఎస్‌వీబీ వసంత రాయుడు తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల సెక్టారు అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. వేమూరు నియోజకవర్గంలో 233 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సెక్టారు అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి, మౌలిక సదుపాయాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లకు పోలింగ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచే చేసే గ్రామాలు, ఓటింగ్ చేయకుండా అడ్డుకునే కేంద్రాల వివరాల పూర్తి నివేదిక రెండు రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించారు. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు తహసీల్దార్లు , ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీనివాసరరావు, వి.పుల్లారావు, ఎం.సుభద్ర, కవిత, బాలాజీ విశ్వనాథ్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై నిరంతర పర్యవేక్షణ

రేపల్లె రూరల్: ఓటరు జాబితాను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉన్నామని ఆర్డీవో హెల షారోన్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. బీఎల్వోలతో ఇప్పటికే జాబితాలను సిద్ధం చేసి, పోలింగ్ బూత్‌ల్లో ప్రదర్శనకు ఉంచామని చెప్పారు. ఓటర్లు తమ వివరాలను జాబితాలో సరిచూసుకోవాలని ఆర్డీఓ స్పష్టం చేశారు. అదేవిధంగా రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఉంటే ఓటు హక్కుకు దరఖాస్తును తమ బీఎల్వోలకు అందించాలని చెప్పారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ యువత చేరిక

కండువా కప్పి ఆహ్వానించిన సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పలువురు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. పేటేరు గ్రామంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు యువకులు వైఎస్సార్ సీపీలో మంగళవారం చేరారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గణేష్ వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో జగనన్న పాలనకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు వైఎస్సార్ సీపీ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేయాలని చెప్పారు. టీడీపీ యువత శొంఠి మణికంఠ, శొంఠి శ్రీను, శొంఠి నాగబాబు, వీరంకి మణి, చెన్ను విష్ణుశ్, బెల్లంకొండ వంశీ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ ఈవూరి కేశవతి పాల్గొన్నారు.

కేసనవారిపాలెం టీడీపీ కార్యకర్తలు వందమంది..

చెరుకుపల్లి: స్థానిక క్యాంపు కార్యాలయంలో నిజాంపట్నం మండలం కేసనవారిపాలేనికి చెందిన షుమారు వందమంది టీడీపీ కార్యకర్తలు మంగళవారం సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము టీడీపీ చెందిన వాళ్లమైనప్పటికీ తమకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలన విధానాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. కేసన లక్ష్మయ్య, చేబ్రోలు వరప్రసాద్, కేసన వెంకటేశ్వరరావు, యేమినేని పానకాలు, కేసన శ్రీనివాసరావు, యేమినేని వీరనారాయణ, కేసన రమేష్ బాబు, యేమినేని రాఘవయ్య, చేబ్రోలు దేవరాజు, ఏలియ్య తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: అర్హులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. నల్లమోతువారిపాలెంలో పింఛనుదారులకు మంగళవారం కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. సమ్మెటవారిపాలెంలో సినీ రచయిత కోన వెంకట్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి దుప్పట్లు అందజేశారు. నల్లమోతువారిపాలెంలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల వాగ్దానాలను 99 శాతం అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సర్పంచ్‌లు నాదెండ్ల భానుప్రసాద్, అక్కల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, పార్టీ నాయకులు మందపాటి పరమానందకుమార్, మరకా పెదవెంకటేశ్వర్లు ఆట్ల నాగేశ్వరరెడ్డి, చిక్కాల సాగర్, చీరాల సత్యనారాయణ రెడ్డి, నాగరాజు, గోపీ ఉన్నారు.

పింఛనుదారులకు దుప్పట్ల పంపిణీ

పిట్టలవానిపాలెం: కోన చారిటబుల్ ట్రస్టు బాపట్ల నియోజకవర్గంలోని ప్రజలకు సహాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన నిఖిల్ అన్నారు. అల్లూరు గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక పింఛనుదారులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీ మేరకు.. రూ.2 వేల ఉన్న పింఛనును రూ.3 వేలు చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. బాపట్ల జిల్లాను అభివృద్ధి చేసుకోవాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా, బాపట్ల ఎమ్మెల్యేగా కోన రఘుపతిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఉప్పు చెంచులక్ష్మి, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, వైస్ ఎంపీపీ కృపానందం, ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణకుమారి, శివారెడ్డి, గోపి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు కె.దేవేంద్రరాజు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణ

వేమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటింగ్, కుట్టు మిషన్ నేర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన

లక్ష్మీపురం: సైబర్ నేరగాళ్ల నుంచి పూర్తి స్థాయిలో రక్షణగా ఇంటర్నెట్‌ని సురక్షితంగా వినియోగించటంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీనియర్ ఇంజినీర్ విశ్లేషకులు ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం అంతర్జాల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఎల్రక్టానిక్ ఉపకరణాలు అంతర్జాలం యాప్‌లను వినియోగించనిదే రోజు గడవని పరిస్థితి ఉందన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ అవగాహన లేకుండా అనవసరంగా సామాజిక మాధ్య మాలను వినియోగిస్తుటం వలన చాలా మంది ఇబ్బందుల్లో పడుతున్నారన్నారు. ముఖ్యమంగా చిన్నారులు ఇంటర్నెట్‌ను అధికంగా వినియోగించడకుండా తల్లి దండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. కంప్యూటర్లు, ఫోన్లు, ట్యాబ్‌లలో సెట్టింగ్స్‌ను మార్చాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, వెబ్‌సైట్లను కట్టడి చేయాలని తెలిపారు.

క్రీడలకు కేంద్రంగా గుంటూరు

మేయర్ కావటి



క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ కావటి

నెహ్రూ నగర్: క్రీడలకు గుంటూరు నగరం కేంద్రంగా మారుతోందని రాష్ట ప్రభుత్వం క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. జనవరి 19, 20, 21 తేదీల్లో రాజస్థాన్‌లో నిర్వహించిన నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మెడల్స్ సాధించిన గుంటూరు నగరానికి చెందిన కె.జగదీశ్వరి, జూనియర్స్ విభాగంలో గోల్డ్ మెడల్, జె.దేశ్ ముఖ్ సీనియర్స్ విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించిన క్రీడాకారును మేయర్‌ను సంపత్‌నగరలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన కె.జగదీశ్వరి, జె.దేశ్‌ముఖ్ మెడల్స్ సాధించడం అభినందించతగ్గ విషయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మారుమూల గ్రామాలలోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని చెప్పారు. దీని ద్వారా ఎంతో మంది క్రీడాకారులు గ్రామాల్లో తమ ప్రతిభను చాటుకున్నారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాదు రాజేష్, గేదెల రమేష్, కంతేటి శ్యాం, కోచ్ లు రంగా, వలి పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్‌పై అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక నల్లపాడు రోడ్డులోని ప్యూచర్ ఫోకస్ మహిళ జూనియర్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు అన్నారు. క్యాన్సర్ బాధితులకు నేడు అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, బాధితులు ఏమాత్రం భయపడకుండా చికిత్స తీసుకోవడం ద్వారా క్యాన్సర్ రహిత జీవితాన్ని కొనసాగించవచ్చన్నారు. యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్‌విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు, ముఖ్యంగా కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మేనేజర్ సి.హెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్- 2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొంటే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. జనవరి 22 తరువాత అందిన ప్రతి ఫారాన్ని సూపర్వైజరీ అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఆమోదం కోసం ఫార్వర్డు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు తగిన విధంగా అధికారులకు విధులు కేటాయిస్తున్నామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయి పరిశీలనకు బీఎల్ఓలకు పంపాలని ఆదేశించారు. గత వారం రోజుల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి 1,143, పశ్చిమ నియోజకవర్గం నుండి 1,645 వివిధ ఫారాలు అందాయని, వాటిని ఆయా బీఎల్ఓలు ఎన్నికల నిబంధనల మేరకు పరిశీలించాలని, సూపర్వైజరీ అధికారులు పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఏఈఆర్‌ఓలు సిహెచ్.శ్రీనివాస్, డి.వెంకట లక్ష్మి, ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్‌లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, వైఎస్సార్‌సీపీ నుంచి జాన్ బాబు, బీఎస్పీ నుంచి సిహెచ్. వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కర్‌రావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుండి జాని బాషా పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరించిన శ్రీనివాసరావు, కలిమి శ్రీ

పాత గుంటూరు: 'పుణ్యభూమి నాదేశం నమో నమామి' శతాధిక కవి సమ్మేళనం ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సౌత్ జోన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీనివాసరావు కార్యాలయంలో సమ్మేళనం పోస్టర్ మంగళవారం ఆవిష్కరించారు. భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి పురస్కరించుకొని నేటి యువతలో దేశభక్తిని, తెలుగుభాషపై ఆసక్తిని, పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు కార్యక్రమాన్ని విజయవాడంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మల్లెతీగ, నవభారత నిర్మాణ సంఘం, భారతీయ జీవిత బీమా సంస్థ, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్టు, స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమ నిర్వాహకులు మల్లెతీగ వ్యవస్థాపకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ రోజంతా జరిగే కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పది ఉత్తమ కవితల్ని ఎంపిక చేసి అదే రోజు సాయంత్రం జరిగే సభలో ఒక్కొక్క కవితకు రూ.1116 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు. పాల్గొన్న ప్రతి కవికీ జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఉంటుందన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయ నూతన ఆడిటోరియంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం కార్యదర్శి సయ్యద్ జానీబాషా, చొప్పా రాఘవేంద్రశేఖర్, కుర్రా సురేష్ బాబు పాల్గొన్నారు.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మహిళను డబ్బులు అప్పు ఇచ్చిన వ్యక్తి దూషించి బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీఅగ్రహారానికి చెందిన నాగేంద్రం అదే కాలనీకి చెందిన బాషా వద్ద రూ.లక్ష అప్పు తీసుకుంది. రూ.50 వేలు చెల్లించింది. అయితే బాషా అధిక మొత్తంలో వడ్డీ లెక్కించి రూ.3 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించి దూషించాడు. నాగేంద్రం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాషా భార్య మస్తాన్‌బి తనను నాగేంద్రం, ఆమె కుమారులు దూషించి దాడి చేశారని ఫిర్యాదు చేసింది. మస్తాన్‌బి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతిని వేధిస్తున్న...

గుంటూరు ఈస్ట్: యువతి వెంటపడి బెదిరిస్తున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కేవీపీకాలనీకి చెందిన గంజి చిన్నోడు, అదే కాలనీకి చెందిన ఓ యువతిని వెంటపడి వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం యువతి ఇంటికి వెళుతున్న సమయంలో దారిలో నా వెంట రాకపోతే చంపుతానని బెదిరించాడు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బౌద్ధ స్థూపం సందర్శించిన కలెక్టర్ రంజిత్ బాషా



భట్టిప్రోలు: ప్రపంచ బౌద్ధారామాలలో చరిత్ర కలిగిన భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సందర్శించారు. మంగళవారం భట్టిప్రోలులో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన బౌద్ధ స్థూపం వద్ద పర్యటించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకముందు స్థానిక సీహెచ్‌సీని సందర్శించి, వైద్యశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యశాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయన వెంట డీఎండ్‌హెచ్‌ఓ ఎస్. విజయమ్మ, గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, వైద్య ఆరోగ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

కర్లపాలెం: వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి ఎంవీ రాజుపాలెంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్లపాలెం పంచాయతీ ఎంవీ రాజుపాలేనికి చెందిన కోమట్ల అర్జున్‌రెడ్డి పశువుల మేత కోసం మూడు ఎకరాల వరిగడ్డి కొని తన ఇంటి వద్ద వామి వేశాడు. రాత్రి గడ్డివామిలో ఒక్కసారిగా మంటలు రావడంతో.. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అదించారు. వారు వచ్చి మంటలను అదుపుచేశారు. వరిగడ్డి వామి దగ్ధమవటంతో సుమారు రూ.25వేల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు.

డ్రైవర్ల గొడవ.. కాల్వలోకి దూసుకెళ్లిన ఆటో



అమర్తలూరు(వేమూరు): ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన గొడవలో.. ఒకరు రన్నింగ్‌లో ఉన్న ఆటోను వదిలేయడంతో అది ప్రయాణికులతో సహా కాల్వలోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివారల మేరకు.. మండూరు, పెదపూడి వంతెన మధ్యలో ఎదురెదురుగా వస్తున్న ఆటోల క్రాసింగ్ విషయంలో డ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. ఇద్దరూ ఆటోల ఇంజిన్లు రన్నింగ్‌లోనే ఉంచారు. ఈ క్రమంలో తెనాలి నుంచి మోపర్రు వెళ్లే ఆటో డ్రైవర్ ఆటో రన్నింగ్‌లో ఉండగానే కిందకు దిగడంతో.. అది కాల్వలోకి ఒక్కసారిగా దసూకెళ్లింది. దీనిని గమనించిన అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఆటోలో ఉన్నవారిని రక్షించారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో తెనాలిలోని ఆసుపత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాటాడుతున్న నలుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అరండల్‌పేట 10వ లైనులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.48 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.